క్లుప్తంగా

రూ.3.50 లక్షలతో బోరు ఏర్పాటు



పామర్రు: గ్రామస్తుల తాగునీటి అవసరాలకు బోరు ఎంతగానో ఉపయుక్తం అవుతుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక కొరముక్కువానిపురంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేస్తున్న బోరు పనులకు శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వార్డు మెంబరు సుబ్రమణ్యేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గుడివాడ కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరిమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10వ తరగతి పాసైన వారు వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ లోపు ఆన్‌లైన ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈనెల 28వ తేదీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల సీట్లకు, 30వ తేదీ ప్రైవేట్ కళాశాలల సీట్లకు ఆయా కళాశాలల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 08674-295953, 82975 74757లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్డులో చిన్నకార్ల స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర స్వామి పందిరిలో భారీ అన్నసమారాధన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంటా అప్పారావు, దుర్గారావు, నాగేశ్వరరావు, కృష్ణ, దుర్గారావు, ఖదీర్, శ్రీను పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతుల ఆందోళన



నందివాడ: బుడమేరు వరదలతో నష్టపోయిన రైతులకు ఎకరా వరి సాగుకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని కోరుతూ నందివాడ మండలం చేదుర్తిపాడులో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ భూమి స్వభావంతో సంబంధం లేకుండా వేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆర్‌సిపి.రెడ్డి, చేదుర్తిపాడు సర్పంచ్ బొల్లం వేణుగోపాలరావు, కౌలు రైతులు సీహెచ్ గోపి, నరేష్, మహేష్, నాగరాజు, బోనం రవి తదితరులు పాల్గొన్నారు

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే వర్ల

పెదపారుపూడి: పెదపారుపూడి ఎస్సీ కాలనీలో విశ్వేశ్వరరావు ఇంటి నుంచి కుటుంబరావు ఇంటి మీద పొలాల వరకు సుమారు రూ.4 లక్షలతో నిర్మించిన జీఎస్‌బీ రోడ్డును ఎమ్మెల్యే వర్ల కుమారరాజా, సర్పంచ్ చప్పిడి సమీరతో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ టీ.సీతామహాలక్ష్మి, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు పాలిశెట్టి సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

పాములపాడు(పెదపారుపూడి): పాములపాడుకు చెందిన పీఏసీఎస్ బ్యాంక్ సభ్యురాలు రాజబోయిన మాణిక్యమ్మ శనివారం మృతి చెందటంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేల చెక్కును సంఘ సీఈఓ పి.కుమారి అందజేశారు. కుమారి మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వారి ఉత్తర్వుల మేరకు సహకారం సంఘం నిధుల నుంచి బ్యాంక్ ఇన్‌చార్జి జె.నాగభూషన్ అనుమతితో రూ.10 వేలను అందజేసినట్లు పేర్కొన్నారు. దగాని లెనిన్, పొట్లూరి మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ యుద్ధ కళల్లో కర్రసాము ఒకటి. నేటి సమాజంలో ఆత్మ రక్షణకు కర్రసాము ఉపయోగపడుతుంది. దీంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కర్రసామును నేర్చుకుంటే విద్యార్థుల ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. ఏకాగ్రత కూడా అధికమవుతుంది. ఈ కారణంగా పలువురు విద్యార్థులు కర్రసాము పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు.

ఆత్మ రక్షణ

- రాష్ట్ర స్థాయి పోటీల్లో 40 పథకాలు
- కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



కర్రసాము.. కేరాఫ్ కలిదిండి

కైకలూరు: కర్రసాము పోటీల్లో కలిదిండి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగిన రాష్ట్ర స్థాయి సిలంబం (కర్రసాము) పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది జిల్లాల నుంచి 270 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్, ఫైట్, కత్తి సాము అనే నాలుగు అంశాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కలిదిండి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నుంచి జూనియర్ విభాగంలో 13 మంది, సీనియర్ విభాగంలో ముగ్గురు వివిధ అంశాల్లో పాల్గొన్నారు. పోటీల్లో 10 గోల్డ్‌మెడల్స్, 16 సిల్వర్, 14 బ్రాంజ్ కలిపి మొత్తం 40 మెడల్స్, షీల్డ్, రూ.5,000 నగదు బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కోచ్ అందుగుల మధుబాబును పలువురు అభినందించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరమే



చదువుతో పాటు క్రీడలను అలవర్చుకోవాలని పదే పదే చెబుతున్నారు. క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడలతో పాటు కర్రసాములోని ప్రావీణ్యం సాధించాలి. మా స్నేహితులతో కలసి కర్రసాము నేర్చుకున్నాను. ఎన్నో మెలకువలు నేర్పారు. రానున్న పోటీల్లో మరిన్ని పతకాలను సాధిస్తామనే ధీమా ఉంది.

– జీ తేజా దుర్గశ్రీ, సిల్వర్ మెడల్, గొల్లగూడెం



కర్రసాము శిక్షణలో విద్యార్థులు

కర్రసాము ప్రాచీన కళ



కర్రసాము ప్రాచీన కళ. విజయవాడలో కోచ్ సత్య శ్రీకాంత్ వద్ద నేర్చుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు ప్రతి ఏటా జరుగుతాయి. తమిళనాడు, మహారాష్ట్రలో కర్రసాము సర్టిఫికెట్ ఉంటే ఐదు శాతం స్పోర్ట్స్ కోటాను కేటాయిస్తున్నారు. పోటీల్లో మరిన్ని విజయాలతో కలిదిండికి మంచి పేరును తీసుకొస్తాం.

– అందుగుల మధుబాబు, కర్రసాము కోచ్, కలిదిండి



విద్యార్థులకు కర్రసాము శిక్షణ ఇస్తున్న కోచ్ మధు

ఆత్మవిశ్వాసం పెరిగింది



కర్రసాము నేర్చుకునేటప్పుడు తొలుత భయమేసింది. కర్ర తిప్పేటప్పుడు చేతులకు తగిలి నెప్పి పుట్టేది. ప్రాక్టిస్ చేసే కొద్దీ ఆ భయం పోయింది. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. దీనిని నేర్చుకునేటప్పుడు మొత్తం శరీరం కదులుతుంది. పోటీల్లో మెడల్ సాధించడం గర్వంగా ఉంది.

– కె.మణికంఠ, గోల్డ్ మెడల్, సానారుద్రవరం

ఆత్మ రక్షణకు ఉపయోగం



కర్రసాము అందరూ నేర్చుకోవచ్చు. మహిళలందరూ కోలాటం వేయడం చూశాను. అక్కడ చిన్న కర్రలు ఉంటాయి. కర్రసాములో పొడవాటి ఎదురు కర్రలు ఉంటాయి. ఆత్మరక్షణ కోసం నేటి బాలికలు దీనిని నేర్చుకోవడం ఎంతో ఉపయోగం. స్నేహితులందరితో కలసి విద్యను నేర్చుకోవడం సంతోషంగా ఉంది.

– బి.ఏంజెల్, సిల్వర్ మెడల్, గొల్లగూడెం

మరిన్ని పతకాలు సాధిస్తాం



కర్రసామును నేర్చుకోవడం సంతోషంగా ఉంది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను నిరూపించుకునే అవకాశం కలుగుతోంది. ఇటీవల పోటీల్లో మా స్కూల్‌కు ఎక్కువ పతకాలు రావడం గర్వంగా ఉంది. మా కోచ్ మాకు కర్రసామును చక్కగా నేర్పుతున్నారు. మరిన్ని పతకాలు సాధిస్తాం.

– కె.భగవాన్, గోల్డ్ మెడల్, కోట కలిదిండి



కర్రసాము పోటీలలో పతకాలు సాధించిన కలిదిండి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మండవల్లి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన యూఎస్ రామరాజు, అబ్దుల్ మస్తాన్, వి.అనసూయ, జయశ్రీ, భాస్కరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జోసఫ్, దయానంద్‌కుమార్, మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పీవీ సారమ్మ, సీహెచ్ పిచ్చోడులను వెలుగు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా అవార్డు పొందిన రామారావును, మండల విద్యాశాఖ అధికారి రత్నసునాదాన్ని ఉపాధ్యాయులు సత్కరించారు. గతంలో వర్షాల కారణంగా వాయిదా వేసిన గురుపూజోత్సవం కార్యక్రమాన్ని శనివారం జరిపినట్లు ఎంఈఓ రామారావు తెలిపారు. ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్, ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ ఎం ఝాన్సీ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

నిత్యావసర వస్తువుల పంపిణీ



బాధితులకు అందించేందుకు సిద్ధంగా ఉంచిన నిత్యావసర సరుకులు



నందివాడ మండలంలో సరుకులు అందజేస్తున్న నాయకులు

పామర్రు: విజయవాడ వాంబే కాలనీలో వరద బాధితులకు పామర్రు అసీస్సీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సుమారు రూ.50వేల విలువ గల నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అసీస్సీ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబెస్టియన్, స్కూల్ కరెస్పాండెంట్ సిస్టర్ రోసీథామస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని సహృదయంతో ఆదుకోవాలని అన్నారు. పీఈటీ మట్టా గ్లాడిసన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: యూటీఎఫ్ నాయకుల సహకారంతో మండలంలోని వరద ముంపునకు గురైనటువంటి వెన్ననపూడి, పొనుకుమాడు, శంకరంపాడు గ్రామాల్లో బాధితులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నీలం ప్రభాకర్, ఎం.చిన్నకుమారి, అశోక్‌కుమార్, రేణుకాలరావు, శ్రీధర్, రంగబాబు, శ్రీదేవి పాల్గొన్నారు

కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలి



పామర్రులో పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

పామర్రు: కాలుష్య నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పామర్రు పోస్టల్ శాఖ సహాయ అధికారి పువ్వల శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు శనివారం పోస్టల్ సిబ్బంది పోస్టల్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది సతీష్, త్రినేత్రి, శ్రీనివాసరావు, అలేఖ్య, ఎల్‌వీ కుమార్ పాల్గొన్నారు.

కొండిపర్రులో..

గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వేస్టును సేకరించినట్లు తెలిపారు. కూటమి నాయకులు వీరాంజనేయులు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



వంటల పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న లావణ్య

కైకలూరు: దానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లావణ్య శనివారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతల పోషకాహారంపై మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఆశా, రెండో బహుమతి గాయత్రీ దక్కించుకున్నారు. స్కూల్ హెచ్ఎం ఆనందకుమార్ పాల్గొన్నారు.

వెళ్లిరావయ్యా.. బొజ్జ గణపయ్యా..

కైకలూరు: మా బొజ్జ గణపయ్యా.. వెళ్లిరా స్వామి అంటూ భక్తులు వినాయక విగ్రహాలను శనివారం ఘనంగా ఊరేగించారు. ఆటపాక పంచాయతీ సమీపంలో వార్షిక గణపతి మహోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన అన్నసమారాధనను వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, పంజా రాంబాబు, కన్నా రమేష్, సింగంశెట్టి రాము, చొప్పాల రాము, తమ్మిశెట్టి కొండా, సిద్ధాబత్తుల శ్రీరామమూర్తి, కశెట్టి పాము, కన్నా బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- కైకలూరు అడవి నాయుడు సెంటర్ వద్ద కూరగాయలు, పండ్ల వర్తక సంఘ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా వినాయక విగ్రహానికి కైకలూరు పురవీధుల్లో ఊరేగించారు. శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. ఏసు, తులసి పూర్ణ, చిన్న, వెంకన్న, గణేష్, ప్రసాద్, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట శ్రీ లక్ష్మీ బైక్ మెకానిక్ వర్క్స్ అధినేత చుక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీగా వినాయక నిమజ్జన ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



కైకలూరులో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



ఆటపాకలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న డీఎన్నార్

కొల్లేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

కలిదిండి(కైకలూరు): కొల్లేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా రానున్న రోజుల్లో అడుగులు ముందుకు వేస్తామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలిదిండి మండలం భాస్కరరావుపేటలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కొల్లేరు ముంపు పరిస్థితికి అధునాతన డ్రోన్ వ్యవస్థతో సర్వే చేయించామన్నారు. ఎగువ నుంచి చేరుతున్న నీరు పెదపాడు నుంచి కొల్లేరుకు చేరుతోందన్నారు. మధ్యలో డ్రెయిన్లు పూడి పోవడం, ఆక్రమణలు తదితర సమస్యలను గుర్తించామన్నారు. ఉప్పుటేరును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో వరద బాధితులకు 24 గంటల్లో 50 టన్నుల బియ్యాన్ని అందించామన్నారు. కొల్లేరు పశువులకు మేతను సరఫరా చేయించామన్నారు. అనంతరం భాస్కరరావుపేట, మూలలంక, పెదలంక ప్రజలు ఇరిగేషన్ భూములకు పట్టాలు పంపిణీ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, ఆర్డీఓ ఎస్ఎస్‌కె.ఖాజావలి, కూటమి నేతలు నరసింహారావు, జోగిరాజు, బాబు, ఏసురాజు, శ్రీనివాసచౌదరీ, చలపతిరావు, రమేష్, బాబీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

- **పాస్టర్లకు గౌరవ వేతనం కొనసాగించాలి**

పామర్రు: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాస్టర్లుకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతి నెలా గౌరవ వేతనం పాస్టర్లకు వచ్చేదని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా పాస్టర్లకు గౌరవ వేతనం కొనసాగించాలని పాస్టర్లు కోరుతున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **విద్యా వ్యాప్తికి దామోదరయ్య కృషి**



గుడ్లవల్లేరు: కౌతవరంలో విద్యా వ్యాప్తికి కానూరి దామోదరయ్య కృషి చేశారని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ అన్నారు. దామోదరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. విజయ డెయిరీ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, ఎంఈఓలు జగన్, గోపాలరావు, హెచ్ఎంలు పద్మావతి, ప్రసాద్ పాల్గొన్నారు.

- **సామూహిక ఎలుకల నిర్మూలన**

మండవల్లి: మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మాట్లాడుతూ మండవల్లి మండలానికి 25 కేజీలు, ముదినేపల్లి మండలానికి 64 కేజీలు బ్రోమోడైలిన్ మందు రైతులకు ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా, సర్పంచ్‌లు, రైతులు కోసూరు మాణిక్యాలరావు, ఎలికే రాంబాబు, ఏపీసీఎస్ఎఫ్ నాగవిజయ పాల్గొన్నారు.

- **కైకలూరులో..**

కైకలూరు: రైతులు అందరూ కలసి సామూహిక ఎలుకల నివారణ చేసుకోవడం ఉత్తమ పద్ధతి అని కైకలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు తెలిపారు. మండలంలో వింజరం, రాచపట్నం, వేమవరప్పాడు గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు.

– వరహాపట్నం గ్రామంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అవిష్కరించారు.

- **అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు**

గుడివాడరూరల్: దీపావళి పండగ నేపథ్యంలో అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో ఎస్ఐ తన సిబ్బందితో అక్రమంగా బాణసంచా నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు గ్రామంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. బొమ్ములూరులోని పెనుమర్తి గురవయ్య, మరో ఐదుగురు ఇళ్లల్లో బాణసంచా అక్రమ నిల్వలను గుర్తించారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ బాణసంచా విక్రయ షాపులను జనసంచారం ఉన్న ప్రాంతాల్లో కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- **హుండీల కానుకల లెక్కింపు**



కైకలూరు: స్థానిక పలు ఆలయాల్లో హుండీలను గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో శనివారం లెక్కించినట్లు గ్రూపు ఆలయాల ఈఓ వీఎస్‌కే.శేఖర్ తెలిపారు. భక్తులు సమర్పించిన 52 రోజుల కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన హుండీలో రూ.1,46,137, రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.9,126, వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.35,948 వచ్చిందని తెలిపారు.

- **పోషకాహార మాసోత్సవాల్లో సీమంతాలు**

మండవల్లి: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా లోకుమూడి-2 అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10,116 విరాళం

పామర్రు: స్థానిక పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం సభ్యులు శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను కలిసి బుడమేరు వరద బాధితుల సహాయార్థం రూ.10,116ల చెక్‌ను అందజేశారు. కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి పామర్రు మండలంలో కళాపీఠం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. పామర్రు మెయిన్‌రోడ్డులో ఘంటసాల విగ్రహానికి స్థలం ఏర్పాటుకు సహకరించాలని కోరామన్నారు. పామర్రు ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కళాపీఠం గౌరవాధ్యక్షుడు కోటి పాండురంగారావు, ఉపాధ్యక్షుడు ఐవీఎస్ మనోహర్ పాల్గొన్నారు.



ఇల్లు దగ్ధం



ముదినేపల్లి రూరల్: మండలంలోని ఊటుకూరు శివారు నారాయణపురంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమై రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన తోట చక్రవర్తి గుడివాడలోని ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. శనివారం యథావిధిగా గుడివాడ విధులకు వెళ్లిపోగా భార్య ఇంటిలోని చిన్నారులను తీసుకుని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. తిరిగివచ్చే సరికి ఇంటి నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడుతుండడాన్ని గమనించింది. స్థానికుల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న బంటుమిల్లి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.3 లక్షల విలువైన గృహోపకరణ వస్తువులతో పాటు రూ.35వేల నగదు, మూడు కాసుల బంగారం అగ్నికి ఆహుతి అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వీఆర్వో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.